క్లుప్తంగా

5న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

అమలాపురం రూరల్: తెలంగాణ రాష్ట్రం మెదక్‌లోని ఐటీసీ ఫుడ్ డివిజన్ కంపెనీకి సంబంధించి అమలాపురం కలెక్టరేట్ వికాస కార్యాలయంలో జాబ్ మేళా ఇంటర్వ్యూలు గురువారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్టు వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఇంటర్మీడియట్ ఒకేషనల్, ఐటీఐ పూర్తిచేసిన 29 ఏళ్లలోపు వయస్సు కలిగిన స్త్రీ పురుష అభ్యర్థులు తమ బయోడేటాతో హాజరు కావాలని తెలిపారు.

వైభవంగా లంకతల్లమ్మ జాతర

ముమ్మిడివరం: గ్రామ దేవత లంకతల్లమ్మ జాతర, తీర్థం మంగళవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. గత నెల 19నుంచి ఈ జాతరను 15 రోజులపాటు వివిధ వ్యాపార, వర్తక, వివిధ వర్గాల వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి జాగరణ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు, బాణ సంచా కాల్పుల నడుమ వైభవంగా జాతర నిర్వహించారు. మంగళవారం అమ్మవారి తీర్థంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి బాలమునికుమారి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు ఏర్పాటు

అమలాపురం రూరల్: అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు అమలాపురం డిపో నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం చల్లా సత్యనరాయణ మూర్తి తెలిపారు. అరునాచలం గిరి ప్రదక్షణ యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం, అరునాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాల్లోని ఆలయాల దర్శనాలు చేసుకోవచ్చని అన్నారు. ప్రత్యేక బస్సు జూన్ 9 తేదీ సోమవారం డిపో నుంచి బస్సు బయలుదేరి క్షేత్రాలు దర్శనం చేసుకుని అరుణాచల గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత 12వ తేదీ గురువారం తిరిగి అమలాపురం వస్తుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ యాత్రకు బస్సు సర్వీసు పెద్దలకు రూ.2,950 టికెట్ ధర నిర్ణయించామన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ల 9959225576, 9959225550 సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సర్వీస్‌కు ఆన్‌లైన్‌లో ముందుగా రిజర్వేషన్ సదుపాయం కలదని సర్వీస్ నంబర్ 99500 ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని డీఎం తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

ఐ పోలవరం: ముమ్మిడివరం మండలం కమినిలంక-కె గంగవరం మండలం శేరిలంక సమీప గోదావరి ప్రాంతంలో స్నానానికి దిగి మృతి చెందిన యువకుల కుటుంబాలకు మంగళవారం రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరుచేసిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఎర్రగరువు ప్రాంతానికి చెందిన వడ్డి మహేష్ (16), వడ్డి రాజేష్ (13) అన్నదమ్ములు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరికీ కలిపి మంజూరైన రూ.4 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఘటన జరగడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండీఎం సిబ్బందికి శిక్షణ

ముమ్మిడివరం: మండలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 80 ప్రభుత్వ పాఠశాలల సిబ్బందికి మండల విద్యాశాఖాధికారులు డి.గౌరిశంకర్, ఆర్.ఉదయభాస్కర్ జిల్లా ఎండీఎం ఏడీ ఎస్.సురేష్ ట్రైనర్లుగా వి.గోపాల్, సాదనాల సూర్యవతి పాఠశాలలో వంట చేసేటప్పుడు గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోండి

అమలాపురం టౌన్: ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పట్టణమంతా సైకిళ్లు తొక్కారు. సైకిల్ తొక్కండి- ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే నినాదంతో వాకర్స్ సైకిళ్లు తొక్కి పట్టణ ప్రజలకు ఆ సందేశాన్ని అందించారు. అమలాపురం గడియారం స్తంభం సెంటరు నుంచి ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డుతోపాటు పలు రోడ్లపై వాకర్స్ సైకిల్ యాత్ర నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బోణం సత్య వరప్రసాద్, పడాల నాయుడు, బూరగాయల శివరామకృష్ణ, పుత్సా కృష్ణ కామేశ్వర్, నూకల సత్యనారాయణ సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

అల్లవరం: కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్యం, ఆహారంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. మండలంలోని బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధి గౌతమినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ అధ్యక్షతన కిశోర వికాసం-2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల చట్టాలు, పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సి.హెచ్.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది బి.విజయకుమారి, వార్డు సభ్యులు బొంతు పల్లంరాజు, దొమ్మేటి ఝాన్సీలక్ష్మి, ఎ.కుమారి, ఎస్.వెంకటలక్ష్మి, ఎమ్.అనంతలక్ష్మి, డి.కృష్ణవేణి పాల్గొన్నారు.

వ్యవసాయం.. దయనీయం

- వ్యవసాయ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఏడాది పాలనలో అందని రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ
- రైతులకు ఆర్థిక భరోసా కరవు

ముమ్మిడివరం: ఒకప్పుడు వ్యవసాయం దండగన్న చంద్రబాబు మళ్లీ అధికారం చేపట్టగానే ఆ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీలను గడిచిన ఏడాదికాలంలో ఒక్కటి కూడా అమలు చేయకపోగా ఆరుగాలం కష్టపడి రైతన్నలు పండించికున్న పంటకు గిట్టుబాటు ధరలు లేకుండా చేయడంతో వ్యవసాయదారులు అప్పుల పాలవుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతన్నలకు అండగా నిలవడంతో రైతులు సంతోషంగా సాగు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన

ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో దాదాపు 32వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా సుమారు 5వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.



రైతు భరోసా కేంద్రం

రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించుకునే విధంగా దళారీ వ్యవస్థలేకుండా అధికారులతో ధాన్యం కొనుగోలు చేయించి దీనికి సంబంధించిన సొమ్మును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసే ఏర్పాటు గత ప్రభుత్వంలో చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే విధంగా నియోజకవర్గం పరిధిలో 40 పైగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంట పెట్టుబడి సాయంగా సుమారు 7వేల మంది రైతులకు ఏడాదికి రూ.15వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వరి సాగులో వారి సందేహాలను నివృత్తి చేస్తూ అధిక దిగుబడికి కృషి చేశారు.

రైతు భరోసా అందించాలి



ఇప్పటివరకు రైతు భరోసా సహాయం అందించకపోగా గత సార్వా సీజన్‌లో జూన్‌లో అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించలేకపోయారు. వెంటనే రైతు భరోసా సాయం అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి.
– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

ఆక్వా రైతు పరిస్థితి మరింత దారుణం

నియోజకవర్గంలో సుమారు 10వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా అమెరికా అధిక పన్నుల కారణంగా రొయ్యల ధరలు గణనీయంగా తగ్గాయి. ఈ అంశాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కిలో రొయ్యలకు సుమారు రూ.50 వరకు రైతు నష్టపోతున్నారు. జోన్ల ప్రమేయం లేకుండా రొయ్యల రైతులందరికీ సబ్సిడీపై విద్యుత్ అందిస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ అమలుకు నోచుకోలేదు. రొయ్యల ధరలు తగ్గడం, మేతల ధరలు పెరగడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆక్వా రైతులు వాపోతున్నారు.

అరాచక పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు

- కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడతాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, నియంతృత్వ పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు రానున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కొర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం రూరల్ భట్నవిల్లి రాష్ట్ర మాజీ మంత్రి, అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్ నివాసంలో అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం అమలాపురం పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జూన్ 4న బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కౌన్సిలర్లకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ కోసం ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు సూపర్ సిక్స్ హామీలిచ్చి నేడు వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై ప్రజలంతా నిరసన తెలపాలన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. జూన్ 4న చంద్రబాబునాయుడు వెన్నులో వణుకు పుట్టేలా 'వెన్నపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ శ్రీకాంత్

తెలిపారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు భట్నవెల్లి మాజీ మంత్రి విశ్వరూప్ నివాసానికి బుధవారం 9 గంటలకు తరలి రావాలన్నారు. అక్కడి నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా వెళ్లి అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పించి గడియార స్తంభం సెంటర్ మీదుగా నల్లవంతెన చేరకుని వంటిద్దు కాంపెక్స్ నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు మున్సిపల్ చైర్ పర్సన్ సత్యానాగేంద్ర మణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ల గోవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, దొంగ సూధారాణి, గోపి రాజి రమేష్, కొల్లాటి దుర్గాబాయి, చిత్రపు రామకృష్ణ, బండారు గోవింద్, యాండమూరి గంగా శ్రీను, చిట్టూరి పెదబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర సుధ, వాసర్ల సుబ్బారావు, విత్తనాల మూర్తి, యన్నబత్తుల సాయి పాల్గొన్నారు.

ఆందోళనను విజయవంతం చేయండి

ముమ్మిడివరం: ఎన్నికల హామీలను విస్మరిస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం సంవత్సర పాలనను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కోరారు. మంగళవారం ముమ్మిడివరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు చైతన్యంతో కూటమి దౌర్జన్యాలపై గళమెత్తేందుకు 4న నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ప్రజల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వ విధానాలను ఎండ గట్టడమే వెన్నుపోటు దినం కార్యక్రమం లక్ష్యమన్నారు.



మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం పార్టీ కార్యాలయం నుంచి..

తాళ్లరేవు: సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయనందుకు నిరసనగా 4వ తేదీన ముమ్మిడివరంలో నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ కోరారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ముమ్మిడివరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించే నిరసన కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని గోవిందకుమార్ కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారని జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు తెలిపారు. పేద విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించేందుకు ఇంతవరకూ జిల్లా కేంద్రం అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం అమలాపురంలో 2021 వరకూ ఎస్‌కేబీఆర్ కళాశాల ఎయిడెడ్ డిగ్రీ కళాశాలగా ఉండేదని గుర్తు చేశారు. 2021 నుంచి ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రైవేటు డిగ్రీ కళాశాలగా మారడంతో డిగ్రీ విద్య ఈ ప్రాంత విద్యార్థులకు అందని ద్రాక్ష అయిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ గోపీ మూర్తి విజయవాడలోని విద్యా శాఖ డైరెక్టర్ శ్యామల రావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారని యూటీఎఫ్ జిల్లా నాయకులు తెలిపారు.



విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి తదితరులు

సమ్మె కారణంగా పెరుగుతున్న తాగునీటి సమస్యలు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉండటంతో ముఖ్యంగా పట్టణంలోని పలు వీధుల్లో తాగునీటి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే సమ్మె కారణంగా కొన్ని వీధుల్లో వీధి దీపాలు వెలగక అంధకారం అలుముకుంటోంది. కుళాయిల ద్వారా తాగునీరు అందని ప్రాంతాలకు మున్సిపాలిటీ ట్యాంకర్లతో తాగునీరును మంగళవారం పంపించింది. పట్టణంలో ప్రధాన ప్రాంతమైన వడ్డిగూడేనికి ట్యాంకర్లతో తాగునీటిని పంపించారు. అతికొద్ది మందిలో మున్సిపాలిటీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. అయితే ఆ కొద్దిమంది అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సేవలందించలేకపోతున్నారు. సమ్మెలో ఉన్న ఇంజినీరింగ్ వర్కర్లకు కౌన్సిలర్లు, అధికారుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నా తమ డిమాండ్ల సాధన కోసం వారు సమ్మె పట్టు వీడడం లేదు. మున్సిపాలిటీకి ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో (చెరువులు) తాగునీటిని ప్రత్యామ్నాయంగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అవగాహన లోపంతో వృథా చేస్తూ ఆ నీటినే విడుదల చేస్తున్నారు. అసలే ఎండా కాలం పంట కాలువల ద్వారా గోదావరి జలాలు అందే లోపు పొదుపుగా చెరువుల నీటిని వాడాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా తాగు నీరు వృథా అవుతోంది.



అమలాపురంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు

యానాం: సీఎం రంగాసామి, ఎల్జీ కైలాషనాథన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఆది ద్రావిడ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆది ద్రావిడ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ ఇలంగోవన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దీపావళికి దుస్తుల కొనుగోలుకు రూ.వెయ్యి అందిస్తామన్నారు. గతంలో కేవలం అయిదు వందలు ఉండేదన్నారు. కులాంతర వివాహాలకు అందించే సహాయాన్ని రూ.5లక్షల నుంచి రూ.6.25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ సాయాన్ని దశల వారీగా రూ.7లక్షలకు పెంచనున్నట్టు తెలిపారు. వర్కింగ్ ఉమెన్, చదువుతున్న బాలికలకు ఎలక్ట్రిక్ బ్యాటరీ ద్విచక్రవాహనాలను ఇస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూ.వెయ్యి నుంచి రూ.5వేలుకు పెంచినట్లు తెలిపారు.

కడప క్రీడా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అమలాపురం రూరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. 4, 5వ తరగతుల్లో బాలికలకు 20, బాలురకు, 20 సీట్లు ఉన్నాయన్నారు. 1 నుంచి 4వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో పాసైన వారికి మాత్రమే 4వ తరగతి లోకి ప్రవేశం కల్పిస్తామన్నారు. దరఖాస్తులను జూన్ 19వ తేదీలోపు అందజేయాలన్నారు. జూలై 1తేదీ నుంచి 3 తేదీ వరకు ఆయా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ : 7993329433 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీ నేత రోహిత్ వర్మకు అభినందనలు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ నాయకుడు దంతులూరి రోహిత్ వర్మ పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకం పొందడంతో ఆయనను అమలాపురంలో మంగళవారం పలువురు పార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా రోహిత్ వర్మ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన పార్లమెంటు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రోహిత్ వర్మను విశ్వరూప్, జగ్గిరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌తో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు అభినందించారు. రోహిత్‌వర్మ తండ్రి దంతులూరి మోహనరాజు కూడా పార్టీ నేతగా, మాజీ కౌన్సిలర్‌గా అమలాపురంలో సేవలందిస్తున్నారు.



దంతులూరి రోహిత్ వర్మ

వేతనాలు పెంచేందుకు స్టీరింగ్ కమిటీ నిర్ణయం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాలు పెంచేందుకు పుదుచ్చేరి స్టేట్ స్టీరింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. మంగళవారం సీఎం రంగసామి అధ్యక్షతన సమావేశం జరిగింది. అంగన్‌వాడీ హెల్పర్ల గౌరవవేతనాన్ని రూ.6వేల నుంచి రూ.12 వేలకు, హెల్పర్ల జీతాలు రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచాలని నిర్ణయించారు. కూరగాయలు, గ్యాస్ సొమ్ము పెంచాలని, 6 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలకు పౌష్టికాహారాన్ని అదనంగా అందించాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని కేంద్ర మంత్రిత్వ శాఖ నిబంధనల మేరకు అందించాలని నిర్ణయించారు. రోజువారీ గుడ్లు, నెలకొకసారి చిరుధాన్యాలను అందించాలని, అంగన్‌వాడీ సెంటర్‌ల అద్దెను రూ.3,250 నుంచి రూ.6వేలకు పెంచాలని, రూరల్ ఏరియాల్లో రూ.1,750 నుంచి రూ.2వేలకు పెంచాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ మంత్రి జయకుమార్, కలెక్టర్ కులొంగొత్తన్, రత్నకిషోర్, ఎల్ ముత్తుమీనా, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ పూజలు

తాళ్లరేవు: కాపులపాలెంలో పునర్నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ తదితర ఆగమ పండితుల ఆధ్వర్యంలో తొలిరోజు విశేష పూజలు నిర్వహించారు. 15 మంది దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత మంగళ వాయిద్యాలతో గణపతి ప్రార్థన, అనంతరం యాగశాల ప్రదక్షిణం చేసి యాగశాల ప్రవేశం చేసారు. పూజల అనంతరం అఖండ జ్యోతి ప్రజ్వలన చేసారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్టవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలు

సత్య సాయి రథానికి ఘన స్వాగతం

అమలాపురం రూరల్: భగవాన్ శ్రీసత్య సాయి బాబా శత జయంతి ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న రథోత్సవానికి బండారులంకలో మంగళవారం భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, భక్తులు రథాన్ని బండారులంకలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రథంలో కొలువుదీరిన భగవాన్ సత్య సాయి బాబాను భక్తులు దర్శించుకున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు కోనసీమ జిల్లాలో ఈ రథోత్సవం కొనసాగనుంది. రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మస్వామి, శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి పాల్గొన్నారు.

ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, మెటర్నటీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి మేరీ జోసఫ్ చిత్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యానాం రీజియన్‌కు జనరల్-2, మాహే-5, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్‌కు 46 పోస్టులు కేటాయించామన్నారు. ఈనెల 4 నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాత పరీక్షను జూలై 13న నిర్వహిస్తామన్నారు.

'పది' రీ వాల్యూయేషన్‌లో పెరిగిన మార్కులు



విద్యార్థిని సుష్మను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని పెయ్యల సుష్మకు రీ వాల్యూయేషన్‌లో 2 మార్కులు అదనంగా పెరిగాయి. పెరిగిన మార్కులతో ఆమె 600 మార్కులకు 579 సాధించింది. అప్పటికే పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన తుమ్మపాల నైనిక మెహర్‌తో పాటు సుష్మ కూడా అదే స్థానాన్ని కైవసం చేసుకుందని ప్రధానోపాధ్యాయురాలు వి.విజయకుమారి తెలిపారు. విద్యార్థిని సుష్మను జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, డీవైఈఈవో గుబ్బల సూర్యప్రకాశం, డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం జెడ్పీ బాలికల పాఠశాలలో అభినందించారు.

కిషోర్‌కు సత్కారం



ఉప్పలగుప్తంలో బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడు కిషోర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన చీకట్ల కిషోర్‌ను మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు మంగళవారం ఉప్పలగుప్తం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, వార్డు సభ్యులు చీకట్ల రెడ్డినాయుడు, చిక్కం వరప్రసాద్, చిక్కం నాగబాబు పాల్గొన్నారు.

వాకర్స్ మాజీ గవర్నర్ శ్రీనివాసరావు మృతి

అమలాపురం టౌన్: వాకర్స్ క్లబ్‌ల పరంగా అనేక పదవులు చేపట్టిన అమలాపురానికి చెందిన పచ్చిగోళ్ల శ్రీనివాసరావు (76) గుండెపోటుతో మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరి కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు 1996లో వాకర్స్ క్లబ్ చార్టర్ సభ్యులుగా పనిచేశారు. 2014లో వాకర్స్ జిల్లా 103 గవర్నర్‌గా సేవలు అందించారు. 2023లో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కో ఆర్డినేటర్‌గా పనిచేశారు. శ్రీనివాసరావు చిన్న కుమార్తె బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. ఆమెను చూసేందుకు బెంగళూరు వెళ్లిన ఆయన అక్కడే గుండెపోటుతో మరణించారు. అమలాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు మంగళవారం అత్యసరంగా సమావేశమై శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, సీహెచ్. విష్ణుమూర్తి శ్రీనివాసరావు మృతి పట్ల సానుభూతి తెలిపారు.



శ్రీనివాసరావు (ఫైల్)

అనుసంధాన రోడ్ల పరిశీలన

అమలాపురం టౌన్: పట్టణ బైపాస్ రోడ్డును అనుసంధానమయ్యేలా నిర్మిస్తున్న రెండు రోడ్లను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం పరిశీలించారు. ఈదరపల్లి వద్ద మరో వంతెన నిర్మాణం నేపథ్యంలో పట్టణంలోకి వాహనాలు సులభంగా ప్రవేశించేందుకు కుమ్మరి కాలువకు ఇరువైపులా ఏటి గట్లపై నిర్మిస్తున్న రోడ్లను (ఆనంద్ మార్గ్, విశ్వరూప్ మార్గ్) ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే 80 శాతం పూర్తయిన విశ్వరూప్ మార్గ్‌ను కబేళా నుంచి సావరం వరకూ 30 అడుగులకు విస్తరించి నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, నూదా చిన్నా, రవణం నరసింహరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో రిలయన్స్ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్ వెన్షన్ ప్రత్యేక పాఠశాలలో 2025-26 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రతినిధి ఎంజే గోపాలరావు తెలిపారు. మానసిక (బుద్ధి మాంద్యత) దివ్యాంగులు, మాటలు రాని, ఆటిజం, చెవిటి, మూగ పిల్లలు, శారీరక వైకల్యాలు గల పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక విద్యతోపాటు ఉచిత వాహన సదుపాయం, యూనిఫాం, పుస్తకాలు, ఉచిత భోజనం సౌకర్యం కల్పిస్తామన్నారు. తమ సెంటర్‌లో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీతోపాటు వృత్తి విద్యలో శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు స్థానిక పాఠశాలను సంప్రదించాలన్నారు.

చేతి వృత్తుల సంఘం నూతన కార్యవర్గం నియామకం

అల్లవరం: మండల చేతి వృత్తుల సంఘం నూతన అధ్యక్షుడిగా యాలంగి రామకృష్ణ ఏకగ్రీవకంగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యానారాయణమూర్తి అధ్యక్షతన అల్లవరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులంతా రామకృష్ణను ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, ఉపాధ్యక్షుడు కొనుకు వెంకటేశ్వరరావు, కన్వీనర్ పితాని బేబీరావు పాల్గొన్నారు.